ఈనాడు మెదక్
మంగళవారం అక్టోబరు 22, 2024

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: కలెక్టర్



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి. అదనపు ఎస్పీ మహేందర్, అధికారులు

మెదక్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల త్యాగాలవల్లే నేడు శాంతి నెలకొందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజారక్షణకు కృషి చేస్తున్న పోలీసులు, అమరులైన బాధిత కుటుంబాలకు యంత్రాంగం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. 24 గంటలు విధులు నిర్వహిస్తూ వారి జీవితాలను ప్రజలకు అంకితం చేస్తున్నారని కొనియాడారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అమరులైన పోలీసుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 103 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్న కుమార్, వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలు ఉపయుక్తం

క్షేత్ర పర్యటనలు సివిల్ సర్వీసెస్ అధికారుల భవితకు బాటలు వేస్తాయని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం సోమవారం కలెక్టర్‌ను కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీ, జిల్లా పరిషత్, జిల్లా సంక్షేమ శాఖల ద్వారా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల జీవన స్థితిగతులు, ఆర్థిక అంశాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకోవడం మంచి పరిణామమన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును సమీక్షించేందుకు ప్రత్యేకంగా ప్రతి కార్యాలయంలో అధికారికి బాధ్యత అప్పగించాలని సూచించారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు..

పొరపాట్లకు తావులేకుండా ప్రజల ఆరోగ్య సమగ్ర సమాచారం నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆశా కార్యకర్తల దినచర్య పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు ప్రతి రోజు చేసే పనులను ఈ పుస్తకం సులభతరం చేస్తుందని, సమగ్రమైన మార్గదర్శకాలను అందిస్తుందని చెప్పారు. ఎప్పటికప్పుడు నాణ్యమైన సేవల అందించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కోటి లింగార్చనకు 70 వేల లింగాలు

కాశీ క్షేత్రంలో నిర్వహించే కోటి లింగార్చనకు మసాయిపేట గ్రామం నుంచి 70 వేల లింగాలను సోమవారం పంపించారు. మట్టితో తయారు చేసిన లింగాలకు భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భజన చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు.


- న్యూస్‌టుడే, వెల్దుర్తి(మాసాయిపేట)

ప్రభుత్వంలో 50%.. ప్రైవేట్‌లో 75%

సిలబస్‌లో 25శాతం వెనుకబడిన సర్కారు బడులు

న్యూస్‌టుడే, మెదక్: ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరిగినా, పదో తరగతి సిలబస్‌ను సకాలంలో పూర్తి చేశారు. పార్ట్-1 పూర్తి చేసి, పార్ట్-2 లోకి ప్రవేశించారు. ఈ మేరకు ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం కాగా వచ్చే నెల నుంచి ప్రత్యేక తరగతులను ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. పాఠ్యాంశాలు ప్రైవేట్ పాఠశాలల్లో 75 శాతం పూర్తి కాగా, సర్కారు బడుల్లో 50 శాతం పూర్తయ్యాయి. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' కథనం...

ప్రతి విద్యార్థికి పదో తరగతి అత్యంత కీలకం. ఇందులో విద్యార్థులు ఉత్తమ జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయా పాఠ్యాంశాలను పూర్తి చేస్తున్నారు. విద్యార్థులకు పార్ట్-1 పుస్తకాలు అందజేసి, అందులో ఉన్న వాటిని పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఏ -1 పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు లేక ఆయా సబ్జెక్టుల్లో ఒక్కరిపైనే భారం పడింది. మెదక్ మండలం మక్తభూపతి పూర్ జడ్పీ పాఠశాలలో హిందీకి ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండడతో అదనపు భారం పడుతోంది.



కూచన్‌పల్లిలో ఎస్‌ఏ -I పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జిల్లాలో పాఠశాలలు ఇలా...	
ఉన్నత	146
కస్తూర్బా	20
ఆదర్శ	7
గురుకులాలు	23
ప్రైవేట్	46
విద్యార్థుల సంఖ్య:	సుమారు 9 వేలు
పదో తరగతిలో 2023-24 జిల్లా స్థానం:	18
గతేడాది పదిలో ఉత్తీర్ణత	శాతం: 92.90

పూర్తి చేసేందుకు గడువు

గత విద్యా సంవత్సరంలో వెలువడిన పది ఫలితాల్లో జిల్లా 18వ స్థానంలో నిలిచింది. ఉత్తీర్ణత శాతం పెరగగా, స్థానంలో మాత్రం వెనుకబడింది. ఈసారి పదో స్థానంలో నిలిచేలా అధికారులు కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. ఇందుకోసం మొదట సిలబస్ పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రైవేట్ పాఠశాలల్లో 75 శాతం సిలబస్ పూర్తయ్యింది. ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ బడులు 25 శాతం వెనుకబడి ఉన్నాయి. సర్కారు బడుల్లో అన్ని చోట్లా ఈ ఏడాది లోపు సిలబస్ పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ మేరకు వచ్చే నెల 1 నుంచి ప్రత్యేక తరగతులను ప్రారంభించనున్నారు. ఉదయం, సాయంత్రం అదనంగా గంట కేటాయించనున్నారు. ప్రతి సబ్జెక్టుపై పరీక్షలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ముద్రించిన కరదీపికను విద్యార్థులకు అందజేస్తారు. వార్షిక పరీక్షల్లో వచ్చే ముఖ్యమైన ప్రశ్నలతో దీనిని ముద్రించారు. జనవరి నుంచి పునశ్చరణ తరగతులు ప్రారంభిస్తారు.



డిసెంబరు వరకు పూర్తయ్యేలా చర్యలు: రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

ఇప్పటి వరకు నిర్దేశించిన పార్ట్-1 సిలబస్ పూర్తయింది. పార్ట్ -2 పుస్తకాలు రావడంతో మండలాలకు పంపించాం. వాటిని విద్యార్థులకు అందజేస్తాం. డిసెంబరు 31 వరకు సిలబస్ పూర్తయ్యేందుకు కృషి చేస్తాం. పాఠశాలలను సందర్శిస్తూ, సిలబస్ పూర్తి చేయాలని సూచిస్తున్నాం. వచ్చే నెల 1 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించనున్నాం.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్-ఎంసీఎస్ అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 4న సంగారెడ్డి, వరంగల్‌లో ప్రారంభమయ్యే అండర్-23 అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొనే జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులతో నాలుగు జట్లను ఎంపిక చేశామని, ఇందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన వారితో తుది జట్టును ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మధుమోహన్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శిక్షకులు చంద్రమౌళి, ఇనాం ఉర్ రహమాన్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ పట్టణ ద్వారకానగర్, [illegible], నల్లపోచమ్మ కాలనీలో విద్యుత్ మరమ్మతు చేపట్టనున్నామని, ఆయా ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ నవీన్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం



మెదక్ మండలం చిట్యాలలో తడిసిన ధాన్యం



రామాయంపేటలో వరదలో నుంచి వడ్లు తీస్తున్న రైతు



హవేలిఘనపూర్‌లో ధాన్యాన్ని ఊడుస్తున్న మహిళా రైతు



పాతూరులో నేలవాలిన వరి

మెదక్, రామాయంపేట, హవేలిఘనపూర్, మెదక్ రూరల్, వెల్దుర్తి, పాపన్నపేట, చేగుంట, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం భారీ వర్షం కురిసింది. మెదక్ పట్టణంలో గంటకు పైగా కురవడంతో రహదారులపై నీళ్లు నిలిచాయి. మెదక్ మండలం చిట్యాల కొనుగోలు కేంద్రం, స్థానిక మార్కెట్ యార్డులో ధాన్యం తడిసింది. మెదక్ మండలం పాతూరులో 5.3 సెం.మీలు, రామాయంపేటలో 5 సెం.మీ హవేలిఘనపూర్ మండలం సర్దనలో 4.5 సెం.మీ వర్షం పడింది. రామాయంపేటలో కొనుగోలు కేంద్రాలకు చేర్చిన వడ్లు తడిసిపోయాయి. వరదలో ధాన్యం కొట్టుకుపోతుండగా కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నించారు. హవేలిఘనపూర్ మండల పరిధి ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల వరద రావడంతో కొట్టుకుపోయింది. మెదక్ మండలం పాతూరు, రాయిన్‌పల్లి, తదితర గ్రామాల్లో కేంద్రాల వద్ద ఉన్న వడ్ల కుప్పలు తడిసిపోయాయి. వరి పైరు నేల వాలింది. వెల్దుర్తి ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద, బండలపైన, రోడ్లపైన ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. చేగుంట, నార్సింగి మండలాల్లో రోడ్లపై ఆరబెట్టిన కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి. నార్సింగి, బోనాల, ఇబ్రహీంపూర్, బి.కొండాపూర్ తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. తడిసిన వడ్లను ఎత్తుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు.



చేగుంట మండలం బోనాలలో..



అవుసులపల్లిలో..



వెల్దుర్తి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద..



మల్లంపేటలో ఇలా..



నార్సింగిలో..

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

మెదక్, న్యూస్‌టుడే: ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించుకునేందుకు పోలీస్ శాఖ పని చేస్తుందని చెప్పారు. ఫిర్యాదుదారుల అర్జీలపై సంబంధిత స్టేషన్ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన: ఎమ్మెల్యే

చేగుంట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న పాలన ఇందిరమ్మ రాజ్యంలా లేదని, ఎమర్జెన్సీ పాలనలా ఉందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. గ్రూప్-1 పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో భారాస ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు అడ్డుకుంటారనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమను నియోజకవర్గాలకు వెళ్లకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు.

వడ్ల తరలింపునకు గోదాముల ఎంపిక

మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 235 కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఈసారి వడ్లు తరలించేందుకు జిల్లాలో మిల్లులు తక్కువగా ఉన్నాయని, గత సీజన్‌లో తీసుకున్న ధాన్యం సరైన సమయంలో బియ్యం అప్పగింత పూర్తి చేయలేక పోయిన మిల్లులకు ధాన్యం కేటాయించడం లేదన్నారు. ఖాళీగా ఉన్న గోదాములను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు.

నేటి తరం కృత్రిమ మేధస్సుదే



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎల్ కంపెనీ డైరెక్టర్ రాజ్ కుమార్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: నేటి తరం కృత్రిమ మేధస్సుదేనని ఆర్ఎస్ఎల్ కంపెనీ డైరెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం, ఆర్ఎస్ఎల్ టెక్నాలజీస్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పైతాన్ లాంగ్వేజీలపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎల్, ఏఐ టెక్నాలజీ, పైతాన్ ప్రోగ్రామ్‌ల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్, కంప్యూటర్ విభాగాధిపతి డా. తిరుమల్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. శరత్ రెడ్డి, అధ్యాపకులు చంద్రశేఖర్, వామనమూర్తి, వేణుగోపాల్‌శర్మ, కాశీ విశ్వనాథ్, చంద్రశేఖర్, నిదర్శిని, నరేష్ గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం: భారాస



వెల్దుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం వెల్దుర్తి, మాసాయిపేట గ్రామాల్లో భారాస ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. వేల మంది రైతులకు రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అమలు కావడంలేదని ఆరోపించారు. హామీలు నెరవేర్చేవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా నాయకులు అనంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, రమేష్‌గౌడ్ శ్రేణులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం: ధాన్యం కొనుగోళ్లను చకచకా నిర్వహించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మాసాయిపేట, బొమ్మారం, నాగ్‌సాన్‌పల్లి, వెల్దుర్తి, ఉప్పులింగాపూర్ గ్రామాల్లో వారు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గానికి వివిధ పథకాల ద్వారా రూ.20 కోట్లు మంజూరు కాగా, ప్రస్తుతం మంత్రి సీతక్క రూ.5 కోట్లు మంజూరు చేశారన్నారు.

దళారులను నమ్మొద్దు



కల్వకుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

రామాయంపేట, న్యూస్‌టుడే: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. నిజాంపేట మండల పరిధి బస్సురాజు పల్లి, రజాక్‌పల్లి, కల్వకుంట, వెంకటాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన నిజాంపేట చెందిన కాంగ్రెస్ నాయకుడు మొయినోద్దీన్‌ను పరామర్శించారు.

అయోడిన్ ఉప్పుతో రుగ్మతల నివారణ



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీరాం

మెదక్, న్యూస్‌టుడే: అయోడిన్ లోపం వల్ల వచ్చే రుగ్మతలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యాధికారి శ్రీరాం అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అయోడిన్ కలిపిన ఉప్పును వాడే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ ఉప్పు వాడడం వల్ల గర్భస్రావం, జనన సమస్యల నుంచి బయటపడవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఉప వైద్యాధికారులు నవీన్, సృజన, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ రమ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



అరవింద్

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మెదక్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మదూరు జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థి అరవింద్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి 30 వరకు పెద్దపల్లిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, పీఈటీ నరేష్ తెలిపారు. సోమవారం విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఆరు గ్యారంటీల అమలులో సర్కారు విఫలం



మాట్లాడుతున్న చుక్క రాములు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, హైడ్రా పేరుతో దౌర్జన్యాలను ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సోమవారం మెదక్ కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. జిల్లా కార్యదర్శి మల్లేశం, కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, బసవరాజు, నరసమ్మ, మహేందర్ రెడ్డి, నాగరాజు, మల్లేశం, బాలనర్సు, సంతోష్ పాల్గొన్నారు.

పంట పొలాలకు విద్యుత్తు తీగలు ఏర్పాటు చేస్తే చర్యలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: పంటలను అడవి పందులు, పశువుల నుంచి కాపాడుకోవడానికి రైతులు పొలం చుట్టూ విద్యుత్తు తీగలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్దుర్తి మండల విద్యుత్తు శాఖ అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. విద్యుత్తు తీగల ఏర్పాటుతో పంట రక్షణ ఏమోకాని, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందన్నారు. ఈ విషయాన్ని అన్నదాతలు గమనించాలన్నారు. పంటల చుట్టూ విద్యుత్తు తీగలు ఏర్పాటు, విద్యుత్తు చౌర్యం కిందికి వస్తుందన్నారు. మండలం వ్యాప్తంగా పొలాలను పరిశీలిస్తామన్నారు. యశ్వంతరావుపేటకు చెందిన ఇద్దరు రైతులు పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తగిలి మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మాణాలు పూర్తయినా.. ప్రారంభానికి నిరీక్షణే!

న్యూస్‌టుడే, నర్సాపూర్: ప్రజా శ్రేయస్సుకు వివిధ భవనాలను నిర్మిస్తున్నా, వాటిని ప్రారంభించేందుకు అధికారులు మీనమేషాలు లెక్క పెడుతున్నారు. రూ.కోట్లు ఖర్చు చేసి వినియోగంలోకి తేకపోవడమేమిటని ప్రజలు విస్తుపోతున్నారు. ఈ పరిస్థితి నర్సాపూర్ పురపాలికలో నెలకొంది. ఇప్పటికైనా దృష్టి సారించాలని అధికారులను కోరుతున్నారు.



వైకుంఠధామం

రూ. కోటి వెచ్చించినా.. : పట్టణంలో అన్ని కులాల వారికి విశాలమైన శ్మశానవాటిక ఉంది. ఇక్కడ అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర ఫైనాన్స్ నిధులు రూ.కోటి కేటాయించి, పనులు పూర్తిచేశారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా స్నానాల గదులు, దహన క్రియలకు రెండు ప్లాట్‌ఫాంలు, వేచి ఉండే గది నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఏడాదవుతున్నా, నేటికీ అందుబాటులోకి తేవడం లేదు. నిర్వహణ లేక అధ్వానంగా మారుతోంది.

వధశాల: రజకుల కాలనీలో రూ.13 లక్షలతో వధశాల నిర్మించారు. మొదట్లో రూ.5 లక్షల జడ్పీ నిధులు వెచ్చించారు. అనంతరం రూ.8లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించి, నిర్మాణం పూర్తిచేశారు. ప్రస్తుతం ఇందులోనే మార్కెట్ నిర్వహిస్తున్నా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు.



పూర్తయిన సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

సేంద్రియ కేంద్రం: పురపాలికలో 15 వార్డులున్నాయి. 25 వేల జనాభా ఉన్నారు. పట్టణ ప్రగతిలో రూ.34లక్షలతో కొత్తగా డంపింగ్ యార్డు నిర్మించారు. సేంద్రియ ఎరువు తయారీకి షెడ్డు ఏర్పాటు చేశారు. ఏడాది గడిచిపోతున్నా దీనిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి, తీసుకురావడం లేదు. పట్టణంలో నిత్యం 4నుంచి 6టన్నుల చెత్త సేకరిస్తుండగా, సంత రోజు 10 టన్నుల వరకూ వస్తోంది. డంప్ యార్డుకు సమీపంలోనే రూ.20లక్షలతో హానికర వ్యర్థాల శుద్ధి కేంద్రం నిర్మించారు. రెండు షెడ్లు, సిబ్బంది ఉండేందుకు ఒక గదిని నిర్మించారు. ఇళ్ల నుంచి తరలించిన వ్యర్థాలను ఇక్కడ శుద్ధి చేస్తారు. ఎందువల్లో దానిని కూడా వినియోగంలోకి తీసుకురావడం లేదు.

వీలైనంత త్వరలో..: అశోక్‌గౌడ్, పురపాలిక అధ్యక్షులు

పూర్తయిన నిర్మాణాలను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. కొన్ని కారణాల వల్ల వీటి ప్రారంభంలో జాప్యం జరుగుతన్నది వాస్తవమే. పురపాలిక సాధారణ సమావేశంలో చర్చించి కౌన్సిల్ తీర్మానం చేస్తాం.

స్వల్పకాలం.. దిగుబడి ఖాయం

ఆలు సాగులో మెలకువలతో..



బోదెల్లో నాటుతున్న విత్తనం

న్యూస్‌టుడే, జహీరాబాద్

ఆలుగడ్డ శీతాకాలంలో పండించే స్వల్పకాలిక పంట. తక్కువ నీరే అవసరం ఉంటుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో దీన్ని సాగు చేస్తుంటారు. అక్టోబరు, నవంబరు నెలలు సాగుకు అనుకూలం. విత్తనం నాటినప్పటి నుంచి కోతకు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జహీరాబాద్‌లోని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.శైలజ ఇలా వివరించారు.

లోతు దుక్కితో..: పొలాన్ని లోతుగా దున్ని బాగా ఎండనివ్వాలి. దీని వల్ల నేలలో ఉండే శిలీంద్రాలు, కలుపు గింజలు చనిపోతాయి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 నుంచి 12 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల మలాథియాన్ పొడి చల్లి కలియదున్నాలి.

శుద్ధి తప్పనిసరి: 20 నుంచి 30 గ్రా. బరువున్న దుంపలను విత్తనంగా వినియోగించాలి. వెలుతురు ఉన్న ప్రదేశంలో ఒక రోజు ఆరబెట్టాలి. దుంపను రెండు, మూడు ముక్కలుగా కోసి లీటరు నీటిలో 2 గ్రా. చొప్పున మాంకోజెట్ కలిపి 10 నిమిషాలు నానబెట్టాలి. ఆ తర్వాత గోనె సంచులు కప్పి 24 గంటలు ఆరబెట్టాలి. 50 సెం.మీ. దూరం పాటిస్తూ బోదెలు తవ్వి నాటాలి.

● నత్రజని 16 కిలోలు, భాస్వరం 24 కిలోలు, పొటాష్ 20 కిలోలు ఎకరాలో బోదెల వెంట వేయాలి. అజోస్పైరిలమ్, పాస్ఫోబ్యాక్టీరియా 2 కిలోల చొప్పున పశువుల ఎరువుతో కలిపి వేస్తే తెగుళ్ల బెడద ఉండదు. విత్తిన 30 రోజులకు 16 కిలోల నత్రజని, 20 కిలోల పొటాష్ వేసి మన్ను ఎగదోసి నీరు అందించాలి. 50 రోజులకు ఇదే మోతాదులో వాడాలి.

నీటి తడులు..: విత్తనం నాటిన ఐదారు రోజుల్లో 2, 3 తడులు అందిస్తే బాగా మొలకెత్తుతాయి. లేదంటే పొటాటో ట్యూబర్‌మాత్ బెడద తీవ్రం అవుతుంది. మొక్క పెరిగే దశలో 7, 8 రోజులకో సారి, దుంప ఏర్పడే దశలో 4, 5 రోజులకోసారి నీరు పారించాలి.

విత్తన రకాలు

కుఫ్రి చంద్రముఖి: గడ్డ గోధుమ రంగులో ఉంటుంది. పంట కాలం 90 నుంచి 95 రోజులు.

కుఫ్రి లవకర్: స్వల్పకాలిక రకం. దుంప తెల్లగా ఉండటమే కాకుండా 70 నుంచి 75 రోజుల్లో పంట చేతికొస్తుంది.

కుఫ్రి జ్యోతి: ఈ రకం విత్తనం మధ్యకాలిక రకం. దుంప తెల్లగా ఉంటూ ఎర్లిబ్లైట్, లేట్‌బ్లైట్ తట్టుకుంటుంది. పంట కాలం 90 నుంచి 100 రోజులు.

వేరుసెనగ పంట... లాభాలు ఇంట



సాంకేతిక పరిజ్ఞానం పాటిస్తూ, అధికారుల సూచనలతో ముందుకు సాగితే ఏ పంటలోనైనా అధిక లాభాలు ఖాయం. ఈ బాటలో నడుస్తూ వేరుసెనగ పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు ధారూర్ మండలం ధారూర్ స్టేషన్‌కు చెందిన పాండు. 25 ఏళ్ల కిందట ఈయన తాత దీన్ని సాగు చేయగా.. అదే సంప్రదాయాన్ని ఈయన సైతం కొనసాగిస్తున్నారు. ఈయనకు ఆరెకరాల పొలం ఉంది. ప్రతి సారి దీన్ని సాగు చేసే ముందు జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్టె ఎరువు పంటలను వేస్తారు. ఇవి ఏపుగా పెరిగాక కలియదున్నుతారు. దీనివల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వచ్చేందుకు దోహదపడుతోంది.

ఎకరాకు రూ.30 వేలు..

ఎకరాకు 70 కిలోల చొప్పున 6 ఎకరాలకు 420 కిలోల విత్తనం అవసరం అవుతోంది. కలుపు తీత, ఎరువులు, పురుగుమందులు తదితరాలకు ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. పంట పూతదశకు నెల రోజుల ముందు జిప్సం చల్లడం వల్ల ఊడలు సులువుగా భూమిలోకి వెళ్లి కాయ పరిమాణం, నూనె శాతం పెరుగుతుంది. నీటి తడులు అందించేందుకు తుంపర పద్ధతిని ఎంచుకున్నారు. అన్ని విధాల సస్యరక్షణ చర్యలు చేపడుతుండటంతో ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మార్కెట్లో క్వింటా ధర రూ.7500 పలుకుతోంది. ఈ లెక్కన ఆరెకరాలకు కలిపి రూ.5.40 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోగా రూ.3.60 లక్షల వరకు మిగులుతోందని పాండు తెలిపారు. – న్యూస్‌టుడే, ధారూర్

రైతేరాజు

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం: 93815 15588

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పత్తి ఆకుల ఈనెలు నల్లగా మారుతున్నాయి. ఏం చేయాలి? – విజయ్, గజ్వేల్

సమాధానం: కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.లు, స్ట్రెప్టోసైక్లిన్ 2 గ్రా.ల మందును 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పైరు ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ మొక్కలకు అందిస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, చేర్యాల

మామిడిలో చెదల నివారణ

మామిడి తోటల్లో అక్టోబరు చివరి, నవంబరు మొదటి వారం నుంచి పూత రావడం ప్రారంభం అవుతుంది. దీనికితోడు చెదలు పట్టడం, క్రిమికీటకాలు చేరడమూ మొదలవుతుంది. ఈ దశలో పూతను సకాలంలో సంరక్షించుకుంటే అధిక దిగుబడులు సాధ్యం. చెదలు పట్టడం, క్రిమికీటకాల బెడద నుంచి బయటపడేందుకు 100 లీటర్ల నీటిలో 8 కిలోల రాళ్ల సున్నం, 3 కిలోల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా క్లోరోపైరిఫాస్ మందు కలిపి ఒక రోజు మందు నానబెట్టాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని చెట్టు కింది నుంచి రెండున్నర అడుగుల మేర మొదలు చుట్టూ పూయాలి. చెట్టుకు అవసరమైన వేడి అందుతుంది.

- న్యూస్‌టుడే, పాపన్నపేట

బెండలో అంతరకృషితో ఫలితం

బెండ తోటలో కలుపును సకాలంలో తొలగించకపోతే పంట నష్టపోక తప్పదు. విత్తనాలు వేయగానే ఎకరాకు పెండిమిథాలిన్ 30 శాతం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 25 రోజుల తర్వాత గొర్రు లేదా గుంటకతో అంతర కృషి చేసుకోవాలి. దీనివల్ల కలుపును సులువుగా నివారించుకోవచ్చు.

– న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట

నిమ్మలో గజ్జి తెగులా..

వాతావరణంలో వస్తున్న మార్పులతో నిమ్మ తోటకు గజ్జి తెగులు ఆశిస్తుంది. దీనివల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వానలతో ఈ తెగులు తోటంతా త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీన్ని గుర్తించగానే సోకిన కొమ్మలను కత్తిరించి కాల్చేస్తే వ్యాప్తి చెందకుండా ఉంటుంది. నివారణకు పది లీటర్ల నీటిలో ఓ గ్రాము స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపి 20 రోజులకోసారి వర్షాలు పూర్తిగా తగ్గే వరకు పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ



గతంలో



ప్రస్తుతం ఇలా..

వృక్ష విలాపం!

పర్యావరణ సమతుల్యానికి వృక్షాలు ఎంతో దోహదం చేస్తాయి. ఏళ్లుగా మొక్కలు నాటి రక్షిస్తుంటేనే ఇది సాధ్యమవుతుంది. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వేర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏళ్ల కిందట అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటి కంటికి రెప్పలా కాపాడారు. అవి ఏపుగా పెరిగి పిల్లలకు చల్లని నీడను అందిస్తున్నాయి. బడి రూపురేఖలను మార్చేశాయి. ఇన్నాళ్లు పచ్చదనానికి తోడ్పడిన పాఠశాల ఆవరణలోని 100కు పైగా వృక్షాలను దసరా సెలవుల్లో నరికేశారు. దీంతో కళావిహీనంగా మారింది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. వాన కురుస్తున్నప్పుడల్లా నీళ్లు నిలిచిపోతుండటంతో మొరం పోయిస్తున్నామని, చెట్ల ఆకులు పడి చెత్తాచెదారం నిండుతోందని, అందుకే తొలగించామని చెప్పారు. మళ్లీ నాటుకోవచ్చని సమాధానం ఇచ్చారు.

– న్యూస్‌టుడే, అల్లాదుర్గం

పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు

-జపాన్ సైన్స్ టెక్నాలజీ ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హాషిమోటో



కార్యక్రమంలో జపాన్ విద్యా సంస్థల ప్రతినిధులు, చిత్రంలో జపాన్ సైన్స్, టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హాషిమోటో, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి

సంగారెడ్డి టౌన్: పరస్పర సహకారంతో ప్రగతికి బాటలు పడతాయని జపాన్ సైన్స్, టెక్నాలజీ(జేఎస్టీ) ఏజెన్సీ అధ్యక్షులు కజుహితో హాషిమోటో పేర్కొన్నారు. జపాన్ మంత్ పేరుతో రెండు రోజుల కార్యక్రమాన్ని ఆయన ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జపాన్ అకడమిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'జపాన్ నెల' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2014 నుంచి ఇండియాతో జేఎస్టీకి మెరుగైన సంబంధాలు ఉన్నాయన్నారు. ఇరుదేశాల మధ్య శాస్త్ర, సాంకేతిక అంశాలను ఇచ్చిపుచ్చుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. జేఎస్టీ ఆధ్వర్యంలో ఇండియాకు చెందిన యువ శాస్త్రవేత్తలకు జపాన్‌లో పర్యటించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. జపాన్‌లో చదివేందుకు వస్తున్న భారతీయుల్లో 5శాతం ఐఐటీహెచ్‌కు చెందిన వారేనని వివరించారు. ఉత్పత్తులపరంగా జపాన్ బలంగా ఉందని, ఇండియా-జపాన్ కలిసి ముందుకు సాగితే శాస్త్ర సాంకేతిక రంగాల్లో అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయన్నారు. జపాన్ మంత్‌లో భాగంగా తమ దేశానికి చెందిన 72 విద్యా సంస్థల ప్రతినిధులు హాజరైనట్లు వివరించారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ జపాన్‌తో ఐఐటీహెచ్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయని, ఇది రెండు దేశాలకు ప్రయోజనమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అధ్యయనం

మెదక్ జిల్లాలో సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల పర్యటన



ఆవంచలో బతుకమ్మ ఆడుతున్న శిక్షణ అధికారులు

తూప్రాన్, నర్సాపూర్ రూరల్, కౌడిపల్లి, రామాయంపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలు, వాటి సత్ఫలితాలపై అఖిల భారత సర్వీస్ శిక్షణ అధికారులు మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధ్యయనం చేయనున్నారు. సోమవారం నాలుగు మండలాల్లోని 4 గ్రామాల్లో వారి పర్యటన మొదలైంది. వారికి ఆయా గ్రామాల ప్రజలు, స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉండి అధ్యయనం చేయనున్నారు. ప్రజలతో మాట్లాడి పథకాల అమలు తీరుపై ఆరా తీయనున్నారు. తూప్రాన్ మండలం మల్కాపూర్‌కు ఐదుగురు అధికారులు వచ్చారు. ఆ బృందం నాయకురాలు, ఐపీఎస్ అధికారిణి సాహిత్య ఆధ్వర్యంలో వారు పర్యటించనున్నారు. తూప్రాన్ ఎంపీడీవో శేషాద్రి, డీఎల్పీవో యాదయ్య, ఎంఈవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు. ● నర్సాపూర్ మండలం ఆవంచలో సోనుపర్మార్, ప్రియాంక, అరుణ్‌కుమార్ సింగ్, భోంస్లే అక్షయ్‌దినకర్, మనీష్‌కన్సాల్ క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. వారికి మంగళహారతులతో ఘనస్వాగతం పలకగా, గ్రామస్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. వైద్యురాలు ఫౌజియా, ఏపీవో అంజిరెడ్డి, ఏపీఎం గౌరిశంకర్, ఎంఈవో తారాసింగ్ తదితరులు ఉన్నారు.

● కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌కు యోగేశ్‌కుమార్, హితేశ్ ఖండేల్‌వాల్, ఆశిష్‌కుమార్, మోహినుల్లా అన్సారీ, సాత్విక్ బృందం వచ్చింది. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారానికి మరో నలుగురు శిక్షణ అధికారులు వచ్చారు. ఎంపీడీవో షాజీలొద్దీన్, తహసీల్దారు రజని, ఏవో రాజ్‌నారాయణలు వారికి స్వాగతం పలికారు.

యువ పర్యాటకం.. అభివృద్ధికి దోహదం



న్యూస్‌టుడే, మెదక్ టౌన్, సిద్దిపేట, సంగారెడ్డి టౌన్

యువతకు దేశ, రాష్ట్ర భౌగోళిక విశిష్టతలు, విభిన్న సంస్కృతులపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం.. పర్యాటక శాఖతో కలిసి యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుకు సంకల్పించింది. దేశంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో ఈ దిశగా అడుగేసింది. వీటిల్లో చేరే వారికి సాంస్కృతిక రాయబారులుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించడం విశేషం.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సందర్శనీయ ప్రాంతాలెన్నో ఉన్నాయి. సిద్దిపేట కోమటిచెరువు, వికారాబాద్‌లోని అనంతగిరి అటవీ ప్రాంతం, మెదక్‌లో ఏడుపాయల ఆలయం, నర్సాపూర్ అటవీ ప్రాంతం, సంగారెడ్డిలో మంజీరా తదితర ప్రాంతాల సందర్శనకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. వీటితో పాటు రాష్ట్రంలోని వివిధ పర్యాటక స్థలాలు, అక్కడి చారిత్రక వైభవం అధ్యయనం చేయడంతో పాటు అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా క్లబ్ సభ్యులు దోహదపడుతారు. మరోవైపు సందర్శకులకు అవగాహన కల్పించే బాధ్యత వీరిపై ఉంటుంది. నాలుగు



మెదక్ చర్చి వద్ద విద్యార్థులు

నాలుగు జిల్లాల్లో క్లబ్‌లు ఏర్పాటు

జిల్లా	విద్యాలయాలు	సభ్యులు
మెదక్	189	3830
సిద్దిపేట	112	2240
సంగారెడ్డి	250	2500
వికారాబాద్	130	2600

జిల్లాల్లో క్లబ్‌ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది.

అన్ని విద్యాసంస్థల్లో..

ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటుచేయనున్నారు. క్లబ్‌కు పాఠశాల ప్రిన్సిపల్ అధ్యక్షుడిగా, ఉపాధ్యాయుడు/అధ్యాపకుడు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. పాఠశాలల్లో 7-9 తరగతులకు చెందిన విద్యార్థులు, కళాశాలల్లో ఆయా గ్రూప్‌లకు సంబంధించిన విద్యార్థులు 20 మంది వరకు సభ్యులుగా ఉంటారు. ప్రతి నెలా ఒకసారి సమావేశమై సభ్యులకు పర్యాటక అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. ఆ నెలకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకుంటారు. క్లబ్‌ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిమిత్తం జిల్లాల డీఆర్డీవోలకు ప్రత్యేకంగా లింకు పంపించారు.

నిర్వహించే కార్యక్రమాలు

● పట్టణాలు, గ్రామాలకు సమీపంలో ఉన్న పర్యాటక కేంద్రాల వరకు ట్రెక్కింగ్, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తారు. ● వ్యాస రచన, క్విజ్, లోగో డిజైనింగ్, చిత్రలేఖనం, పోస్టర్ డిజైనింగ్ వంటి అంశాల్లో పోటీలు. ● పర్యాటకం ప్రాధాన్యంపై ఉపన్యాస పోటీలు. ● సందర్శనీయ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం. ● చారిత్రక, వారసత్వ ప్రాంతాల ప్రాముఖ్యతపై ప్రచారం చేయడం.



ప్రయోజనాలు ఇలా..

● వివిధ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాలపై అధ్యయనం చేయవచ్చు.

● అక్కడి ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవచ్చు.

● యాత్రలు, అనుభూతులను కథలు, షార్ట్‌ఫిల్మ్స్‌గా మలిచే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షలకు ఉపయోగపడతాయి.

● పర్యాటకుల గైడ్‌గా పని చేసి ఉపాధి పొందే అవకాశం ఉంటుంది.


ఇదో సదవకాశం



యువ పర్యాటక క్లబ్‌ల ద్వారా పర్యాటక రంగంపై అవగాహన పెరుగుతుంది. ఈ రంగంలో స్థిరపడేందుకు ఇదో సదవకాశం. పర్యాటక ప్రదేశాలపై అధ్యయనం చేయడం వల్ల భవిష్యత్తులో పలు రకాలుగా ఉపయోగపడుతుంది.

– వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పరిశోధన ఫలాలు రైతులకు అందేలా చేస్తాం: వీసీ రాజిరెడ్డి



ములుగు: ఉద్యాన పంటలు, నూతన వంగడాలపై చేసిన పరిశోధనల ఫలితంగా వచ్చిన ఫలాలను రైతులకు అందేలా చేస్తామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ) దండా రాజిరెడ్డి అన్నారు. కొత్త వీసీగా సోమవారం ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పరిశోధనలతో కూడిన విద్యను అందించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వీసీ నీరజ ప్రభాకర్, రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, విజయ, నటరాజన్ శ్రీనివాసన్, లక్ష్మీ నారాయణ, నాగేశ్వర్‌రావు, ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేట అర్బన్: ఎస్‌జీఎఫ్ ఖోఖో అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హరీశ్, శివప్రసాద్, రంజిత్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుభార్గవి తెలిపారు. ఈ నెల 20న ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి విభాగంలో ముగ్గురు విద్యార్థులు ఖోఖో పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125-00	డ్రెస్డ్ 213-00	
రిటైల్ 147-00	స్కిన్‌లెస్ 243-00	

రైతును బలి తీసుకున్న రక్షణ తీగ



కిషన్

వెల్దుర్తి: అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ ఏర్పాటుచేసిన ఇనుప కంచెకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వగా.. అదే ఆ రైతు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ విషాదకర ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేటలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాచపల్లి కిషన్ (55), స్వరూప దంపతులకు కుమారుడు వంశీ ఉన్నాడు. వ్యవసాయమే జీవనాధారం. పొలంలోకి అడవి పందులు దూరకుండా ఉండేందుకు చుట్టూ కంచె బిగించి దానికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చాడు. రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి కంచెకు కరెంట్ కనెక్షన్ ఇవ్వగా, సోమవారం ఉదయం దాన్ని తొలగించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అక్కడికి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు రోజుల్లో ఇద్దరు.. ఈ నెల 19న ఇదే గ్రామానికి చెందిన గుండెని యాదయ్య పొలం చుట్టూ ఏర్పాటుచేసిన విద్యుత్తు తీగకు తగిలి మృతి చెందిన విషయం విదితమే. అది మరువక ముందే ఈ ఘటన జరగడం గ్రామంలో విషాదాన్ని నింపింది.

విద్యుదాఘాతంతో యువరైతు...



దుర్గేశ్

హత్నూర, న్యూస్‌టుడే: అహర్నిశలు శ్రమించి పైరును కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. ఆ చేనును కోసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డారు. ఈ ఘటన హత్నూర మండలం నాగుల్‌దేవుల్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. నాగుల్‌దేవుల్‌పల్లికి చెందిన పడాల దుర్గేశ్(34) సన్నకారు రైతు. వానాకాలంలో తన పొలంలో వరి వేయగా కోతకొచ్చింది. తండ్రి మల్లయ్యతో కలిసి పొలానికి వెళ్లాడు. యంత్రంతో వరి కోస్తున్న క్రమంలో.. ఆ యంత్రానికి విద్యుత్తు తీగ తగిలి దుర్గేశ్‌పై పడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుమారుడిని.. తండ్రి స్థానికుల సహాయంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గేశ్‌కు భార్య లత, నాలుగేళ్ల కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోని మోటారు తీయబోయి రైతు మృతి



చంద్రం

దౌల్తాబాద్: చెరువులో ఉన్న మోటారును పైకి తీయబోయి ప్రమాదవశాత్తు నీటిలో పడి రైతు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు.. ఉప్పరపల్లికి చెందిన చంద్రం(49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వరి పొలానికి నీరు పెట్టుకోవడానికి మోటారును చెరువులో వేశాడు. వరికి నీటి అవసరం తగ్గిపోవడంతో మోటారును పైకి తీయడానికి యత్నిస్తుండగా కాలుజారి చెరువులో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. పొరుగు పొలం రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

మాచిన్‌పల్లిలో గుర్తుతెలియని మృతదేహం

దౌల్తాబాద్: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లిలోని ఊట చెరువులో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మాచిన్‌పల్లి అటవీ ప్రాంతంలోని ఊటచెరువులో మేకలకు నీరు తాపడానికి కాపరులు వెళ్లగా మృతదేహం నీళ్లలో తేలి ఉండటాన్ని గమనించారు. వెంటనే గ్రామస్థులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి విచారించినా ఎవరన్నది తెలియలేదన్నారు.

పాత కక్షలతో యువకుడి హత్య



అనిల్‌రాజు

సదాశివపేట, న్యూస్‌టుడే: పాత కక్షలతో యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన సదాశివపేట పట్టణంలో చోటుచేసుకొంది. సీఐ తెలిపిన వివరాలు.. మ్యాతరి అనిల్ రాజు(29) సిద్దాపూర్ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కాలనీకి చెందిన మరో ఇద్దరితో కలసి మద్యం తాగడానికి వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం ఉదయం స్థానిక ప్రభుత్వ నర్సరీలో యువకుడి మృతదేహం రక్తపు మడుగులో ఉందని సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. అనిల్ రాజు తల్లి ధనలక్ష్మి కాలనీలోని ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ ముగ్గురితో తమ కుటుంబానికి విభేదాలు ఉన్నాయని, పాత కక్షలతో హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. హత్యచేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



లింగంచారి

పాపన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని పాత లింగాయిపల్లికి చెందిన కమ్మరి లింగంచారి (36), అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లింగంచారి 8 ఏళ్లుగా కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. దసరాకు అందరూ స్వగ్రామానికి వచ్చారు. కొన్ని నెలలుగా ఉపాధి సరిగా లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో దూలానికి ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు సుధాకర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మనోవేదనతో మరొకరు..



రమేష్

నిజాంపేట (రామాయంపేట): ఆర్థికంగా సతమతమవుతున్న ఒకరు మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా నిజాంపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని నార్లాపూర్‌కు చెందిన బోయిని రమేష్ (32), భాగ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే కూలి డబ్బులతో కుటుంబ పోషణ భారంగా మారడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సమీపంలోని కల్వకుంట శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించారు. భాగ్యలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ట్రాక్టర్ ఢీకొని రైతు దుర్మరణం



బాలకిష్టయ్య

దుబ్బాక: అతి వేగంతో, అజాగ్రత్తగా ట్రాక్టర్ డ్రైవర్.. వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రైతు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాలు.. దుబ్బాక మండలం బల్వంతాపూర్‌కు చెందిన జంగిటి బాలకిష్టయ్య (65), లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. వ్యవసాయమే జీవనాధారం. ఆదివారం మధ్యాహ్నం బాలకిష్టయ్య ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బల్వంతాపూర్ గ్రామానికి ఓ పని నిమిత్తం బయల్దేరాడు. మార్గమధ్యలో ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి బాలకిష్టయ్య బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడికి సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం కేసు నమోదు చేశారు.

బైక్ అదుపు తప్పి వాహనదారుడు..

బెజ్జంకి: రాజీవ్ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. గోదావరిఖనికి చెందిన బోనగిరి మనోజ్(25), కొత్తగూడెంకు చెందిన జోన్ అన్విత్ ఇద్దరు మిత్రులు. కరీంనగర్‌లో అద్దె గదిలో ఉంటూ ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్నారు. పని నిమిత్తం కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట వైపు బయల్దేరారు. తోటపల్లి వద్ద ప్రమాదం జరిగింది. 108 వాహనంలో ఇద్దరిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మనోజ్ మృతి చెందాడు. అన్విత్ చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు రాగానే కేసు నమోదుచేస్తామని ఎస్సై తెలిపారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి సాయిసింధు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే రోగాన్ని నయం చేయవచ్చని మండల వైద్యాధికారి సాయి సింధు తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేట పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ చేగుంట వారు నిర్వహించిన క్యాన్సర్ వ్యాధి అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం క్యాన్సర్ వ్యాధి లక్షణాలను గుర్తించే కరపత్రాలను ఆవిష్కరించారు. క్లబ్ అధ్యక్షుడు బుర్కా నాగరాజు, కార్యదర్శి రామచంద్రం, కోశాధికారి సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ ప్రభుత్వ ఐటీఐలో 2024-26 విద్యా సంవత్సరానికి ఆయా కోర్సుల్లో మిగిలిన సీట్లలో తక్షణ ప్రవేశాలకు ఈ నెల 21 నుంచి 30 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుని, కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆస్పత్రి భవనాలు శిథిలం.. అవస్థల్లో జనం


శివ్వంపేట ఆరోగ్య కేంద్రం పాత భవనం


వెల్దుర్తిలో మండల వైద్యాధికారి కార్యాలయం

న్యూస్‌టుడే, శివ్వంపేట, వెల్దుర్తి, పాపన్నపేట: ఆరోగ్య కేంద్రాల భవనాలు శిథిలం కావడంతో పాటు నిరుపయోగంగా మారాయి. దీంతో వైద్య సేవలకు అసౌకర్యం ఏర్పడి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రి భవనాలకు మరమ్మతులు చేయక ఎటూ కాకుండా పోతున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని బాగుచేసి అవస్థలు దూరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయాచోట్ల పరిస్థితి: శివ్వంపేటలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనం వృథాగా ఉంది. భవనం శిథిలం కావడంతో వర్షానికి కొన్ని గదుల్లో నీరు లీకేజీ అవుతుంది. దీంతో డీఎంహెచ్‌వో గత కొన్ని నెలల క్రితం భవనాన్ని మూసివేయాలని ఆదేశించడంతో తాళాలు వేసి ఉంచారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఉన్న నర్సు ట్రైనింగ్ సెంటర్ భవనాన్ని పూర్తిగా శిథిలం కావడంతో కూల్చివేశారు. పాత ఆస్పత్రి భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం, మందుల నిల్వలు, శస్త్ర చికిత్సల గది, ల్యాబ్, సిబ్బంది గదిగా ఉపయోగించేవారు. శిథిల భవనంలో అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని తాళం వేశారు. ఈ విషయమై వైద్యాధికారి సాయి సౌమ్యను వివరణ కోరగా.. ఆస్పత్రి పాత భవనం శిథిలం కావడంతో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు నాలుగు నెలల క్రితం తాళం వేశామన్నారు. రెండు గదులను మందుల నిల్వ కోసం వినియోగిస్తున్నారు. గతంలో ఈ భవనాన్ని కూడా కూల్చివేస్తామని చెప్పడంతో మందుల నిల్వ, ఇతర అవసరాలకు ఇబ్బంది ఉంటుందన్ని కూల్చకుండా చూశామన్నారు.

* పాపన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం ఓపీ సేవల కోసం సుమారు 100 మంది వరకు వస్తుంటారు. ఏళ్ల కిందట నిర్మించినది కావడంతో శిథిలావస్థకు చేరి స్లాబు నుంచి నీరు కిందికి లీకేజీ అవుతుంది. దీంతో మందులు తడిసిపోతున్నాయి. సిబ్బంది, రోగులు సైతం అవస్థలు పడుతున్నారు. వైద్యుడి గదిలో ఓపీ సేవలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది.

వెల్దుర్తి పీహెచ్‌సీలో అన్నీ సమస్యలే

వెల్దుర్తిలో నిజాం కాలం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది దీనికి 45ఏళ్ల క్రితం సొంత భవనం నిర్మించారు. మండల వైద్యాధికారితో పాటు ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు స్టాఫ్ నర్స్ స్థానికంగా ఉండాలని భావించి 40ఏళ్ల క్రితం భవనాల నిర్మాణం చేపట్టి, కేవలం మండల వైద్యాధికారి కార్యాలయ భవనాన్ని మాత్రమే నిర్మించారు మిగతా క్వార్టర్లను గుత్తేదారు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రస్తుతం అవి పూర్తిగా శిథిలమైయ్యాయి. డాక్టర్ క్వార్టర్ పదేళ్ల క్రితం వరకు బాగానే ఉన్నా ఇక్కడ ఎవరూ ఉండకపోవడంతో తలుపులు, నల్లాలు పనిచేయక నిరుపయోగంగా వదిలేశారు. ఆస్పత్రి ఆవరణలో పొదలు పెరిగి అపరిశుభ్రంగా ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్ 95730 81675
నర్సాపూర్ 80085 73222
తూప్రాన్ 96762 58144
చేగుంట 80085 73200
పెద్దశంకరంపేట 80085 73251
రామాయంపేట 94402 31031
(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట

? పెద్దశంకరంపేట బస్టాండ్ వద్ద అంబేడ్కర్ చౌక్ సమీపంలో రహదారిపై భారీ గుంతలు ఏర్పడి బస్సులు కిందకు తాకుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందితో పాటు బస్సులు పాడవుతున్నాయి. – కె.శేఖర్, స్థానికుడు

✓ గుంతలను పరిశీలించి అవసరమైనచోట మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. – మల్లేశయ్య, ఆర్టీసీ డీఎం, నారాయణఖేడ్

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం మండల పరిధి రుద్రారంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. లక్ష్మణ్, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఐకేపీ ఆధ్వర్యంలో..

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్ గ్రామాల్లో ఈ నెల 22న మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. క్వింటాల్ రూ.2,330, సన్న రకానికి రూ.500 బోనస్ ఉంటుందన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మనోహరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉషోదయ లేజర్ ఐ హాస్పిటల్ సహకారంతో సోమవారం మండలంలోని రంగాయిపల్లిలో ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. వైద్యసేవల అనంతరం వృద్ధులకు మందులు పంపిణీ చేశారు.

రోడ్డు బాగు చేయాలని వినతి

అల్లాదుర్గం న్యూస్‌టుడే: జాతీయ రహదారి నుంచి అల్లాదుర్గం గ్రామానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని అల్లాదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షుడు బ్రహ్మం కోరారు. అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

దారి అంచున ధాన్యం.. జర పైలం


గవ్వలపల్లి-రామాయంపేట ప్రధాన రహదారిలో

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: ఆరుగాలం పండించిన వరి పంటను ఆరబెట్టేందుకు రైతులు కల్లాలకు బదులు రహదారులను వినియోగిస్తున్నారు. ఫలితంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై ధాన్యం పోసి బండరాళ్లు ఉంచుతున్నారు. దీంతో రాత్రిళ్లు వాహనదారులు దగ్గరకు వచ్చే వరకు ధాన్యం కుప్పలు కనిపించక ప్రమాదాల పాలైన సంఘటనలు ఉన్నాయి. అయినా కూడా పట్టించుకోవడంలేదు. అధికారులు కూడా హెచ్చరించక పోవడం విశేషం.

● చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లికి చెందిన రమేష్ స్థానికంగా ఉన్న పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. గవ్వలపల్లి-రామాయంపేట ప్రధాన రహదారి సంగాయపల్లి వద్ద ఉన్న మూలమలుపులో ధాన్యం కుప్ప ఉంది. దగ్గరకు వచ్చే వరకు కుప్ప కనిపించక ద్విచక్ర వాహనం అదుపు తప్పి కుప్పపై నుంచి ఎగిరి పది అడుగుల దూరంలో పడ్డాడు. దీంతో అతని ఎడమ చెవి సగ భాగం తెగిపోయి, పక్క ఎముక విరిగింది. స్థానికులు గవ్వలపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. సోమవారం మెదక్ ఆసుపత్రికి తరలించారు. మూడు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు.

రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు: ఎస్సై నారాయణ

రైతులు పంట పొలాల వద్ద, ఖాళీ స్థలాలలో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి. రహదారుల వెంట పోసిన ధాన్యం కుప్పలను ఢీకొని ఎవరైనా ప్రమాద బారిన పడితే ఆ బాధ్యత ధాన్యం పోసిన రైతుదే అవుతుంది. ఈ విషయాన్ని అన్నదాతలు అర్థం చేసుకోవాలని కోరారు. ధాన్యం కుప్పలు తొలగించాలని లేదంటే చర్యలు తగిన తీసుకుంటామన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: భారాస


శివ్వంపేటలో నిరసన చేస్తూ..


కౌడిపలి: జాతీయ రహదారిపై ధర్నా

శివ్వంపేట, కొల్చారం, కౌడిపల్లి, న్యూస్‌టుడే: హామీలు ఇచ్చి అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేస్తుందని భారాస నాయకులు ఆరోపించారు. సోమవారం శివ్వంపేటలో నర్సాపూర్-తూప్రాన్ జాతీయ రహదారిపై భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మూడు పంటలకు రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. రైతు రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయకుండా దగా చేస్తుందన్నారు. భారాస మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మహేష్ గుప్తా, మాజీ ఎంపీపీ హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ తదితరులు పాల్గొన్నారు. కొల్చారంలో భారాస మండలాధ్యక్షుడు గౌరీశంకర్ కార్యకర్తలతో కలిసి మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కౌడిపల్లి జాతీయ రహదారిపై భారాస మండలాధ్యక్షుడు రామాగౌడ్, మాజీ ఎంపీపీ రాజునాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అమర్‌సింగ్‌ల ఆధ్వర్యంలో రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ సర్పంచి ఎల్లం, నాయకులు మహిపాల్‌రెడ్డి, ఖుత్బోద్దీన్, గౌరిరెడ్డి, పోల నవీన్, అనిల్, రమేశ్‌గౌడ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని దంతాన్‌పల్లిలో పాము కాటుకు గురై మృతి చెందిన గేడి జ్యోతి కుటుంబానికి జడ్పీటీసీ మాజీ సభ్యుడు పబ్బ మహేష్‌గుప్తా సోమవారం నిత్యావసర సరుకులు, రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. చండి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోపాల్ దంపతులను పరామర్శించి రూ.10వేలు అందజేశారు. దంతాన్‌పల్లికి చెందిన కన్నారం పోచమ్మ ఇటీవల మృతిచెందగా శివ్వంపేట సహకార సంఘం చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి రూ.5వేల సాయం అందించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: ఏబీవీపీ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

తూప్రాన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్ డిమాండ్ చేశారు. సోమవారం తూప్రాన్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బ్రతుకులు మారడం లేదన్నారు. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువు కోసం సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ప్రభుత్వం తూట్లు పొడిచే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్, కార్యకర్తలు కార్తీక్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

నియామకంపై హర్షం

అల్లాదుర్గం న్యూస్‌టుడే: వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మి నియామకంపై కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శేషారెడ్డి సోమవారం హర్షం వ్యక్తం చేశారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి: ఆర్డీవో

తూప్రాన్, న్యూస్‌టుడే: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ధరణి సమస్యలకు సంబంధించి 14 ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

పోలీసుల త్యాగాలు మరువలేనివి: డీఎస్పీ


తూప్రాన్‌లో నివాళి అర్పిస్తున్న డీఎస్పీ వెంకటరెడ్డి, ఎస్సై శివానందం


చిన్నశంకరంపేటలో ఎస్సై శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది

తూప్రాన్, పాపన్నపేట న్యూస్‌టుడే: విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎస్సై శివానందంతో కలిసి తూప్రాన్‌లో డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని వారం పాటు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పాపన్నపేట ఠాణాలో అమరవీరుల స్థూపానికి ఎస్సై శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది నివాళులు అర్పించారు. 1999 సెప్టెంబర్ 13న పేట ఠాణాను మావోయిస్టులు పేల్చివేయడం బాధాకరమన్నారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం పాత పింఛను విధానాన్ని వెంటనే అమలు చేయాలని టీజీ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగ నర్సింలు అన్నారు. సోమవారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ..సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన డీఏను వెంటనే మంజూరు చేయాలన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీకి వినతి

న్యూస్‌టుడే, నర్సాపూర్: పట్టణంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావును పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బబ్బురి కృష్ణ తదితరులు సోమవారం హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ వీలైనంత త్వరలో నర్సాపూర్‌లో క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తానని తెలిపారు.

ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నవీన్‌కుమార్

నర్సాపూర్: నర్సాపూర్ పట్టణానికి చెందిన చిక్కులపల్లి నవీన్‌కుమార్ ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు నియామక పత్రాన్ని హైదరాబాద్‌లో సోమవారం అందజేశారు.

గ్రామానికి వైకుంఠరథం వితరణ

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మనోహరాబాద్ మండల కేంద్రంలో చీర్ల భాస్కర్ యాదవ్ తాత కేశబోయిన అంజయ్య యాదవ్ జ్ఞాపకార్థం పంచాయతీకి వైకుంఠరథాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారి సమక్షంలో సోమవారం అందజేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

పాపన్నపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వద్ద సందర్శకుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం యూసుఫ్‌పేటలో ఆయన మాట్లాడుతూ. .ఏడుపాయల ఆలయం, మెదక్ చర్చి, పోచారం ప్రాజెక్టు వద్ద కాటేజీలు నిర్మించాలన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తామని కెనరా బ్యాంకు హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డులో కెనరా బ్యాంకు నూతన శాఖను సామాజిక కార్యకర్త హనుమంతరావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. వ్యాపారవేత్త రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఎంఈవో విఠల్ అన్నారు. సోమవారం మండలంలోని చండూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని పలు పాఠశాలలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులందరికీ పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ, హరిసింగ్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు సునీల్, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాలు..


రహదారిపైనే నిలిపిన వాహనాలు

న్యూస్‌టుడే, రామాయంపేట: ఓవైపు రహదారిపై లేస్తున్న దుమ్ము పేరుకుపోయిన ఇసుక.. మరోవైపు రహదారిపైనే అడ్డదిడ్డంగా నిలిచిన వాహనాలు ఇది రామాయంపేటలో కామారెడ్డికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి. ప్రయాణ ప్రాంగణం నుంచి కామారెడ్డి వైపు వెళ్లే రహదారి విశాలంగా ఉంటుంది. ప్రస్తుతం చూస్తే ఇరుకుగా అనిపిస్తుంది. ఇందుకు కారణం దారికి ఇరువైపులా వ్యాపార దుకాణాలకు సంబంధించి పనులపై వచ్చే వారి వాహనాలతో నిండి ఉంటుంది. విశాలమైన రహదారి సైతం ఇరుకు రోడ్డుగా దర్శనమిస్తుంది.

ఇష్టారీతిగా వాహనాల నిలిపివేత: రామాయంపేట పట్టణంలో ఎస్బీఐ బ్యాంకు వచ్చే వారు గంటల తరబడి వాహనాలు ఇష్టారీతిగా రహదారిపై నిలిపి ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ మార్గంలో వాహనాలు ఎదురెదురుగా వెళ్లాల్సి ఉన్నా ఎస్బీఐ వద్దకు రాగానే మరో వాహనం వెళ్లలేని దుస్థితి. దీంతో ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో పోలీసులు జరిమానాలు విధించిన వాహనదారుల తీరు మారకపోవడం శోచనీయం.

ఇసుక తొలగించక ఇక్కట్లు

ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంతో పాటు దాని సమీపంలోని కాలనీల నుంచి వర్షం కురిసినప్పుడు పెద్దఎత్తున వరద చేరుతుంది. ఎస్బీఐ ముందున్న ప్రధాన రహదారిపై నుంచి సమీపంలోని కాల్వలోకి వర్షం వెళ్లడంతో రహదారిపై ఇసుక పేరుకుపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వేగంగా వచ్చి బ్రేకులు వేసిన సందర్భంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనికి తోడు రహదారి దాటే వారు కూడా ప్రమాదాల బారినపడుతున్నారు. రహదారిపై పేరుకుపోయిన ఇసుకను ఎప్పటికప్పుడు శుభ్రం చేయక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామసభల ద్వారా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయండి

కౌడిపల్లి, న్యూస్‌టుడే: గ్రామ సభల ద్వారానే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని లేదంటే ఆందోళన చేపడతామని భారాస మండలాధ్యక్షుడు రామాగౌడ్ హెచ్చరించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో భారాస శ్రేణులతో కలిసి ఏకపక్షంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందించారు.

చారిత్రక కట్టడాల్ని కాపాడండి

నర్సాపూర్: చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో చారిత్రక కట్టడాన్ని కాపాడాలని కోరుతూ గ్రామానికి చెందిన మాజీ సర్పంచి పాండురంగారెడ్డి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. రాజుల కాలం నాటి కట్టడం గడిని కొందరు కూల్చివేసి దాని స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఆర్డీవో సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడారు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేటి నుంచి డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు


ఓటు నమోదు పత్రాన్ని చూపుతున్న ప్రిన్సిపల్ హుస్సేన్, రాజాగౌడ్, దేవదాస్

మెదక్ అర్బన్, నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ కె.హుస్సేన్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి రాజాగౌడ్, అధ్యాపకుడు దేవదాస్ మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలోని పట్టభద్రులు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు నవంబరు 6లోగా దరఖాస్తు చేసుకోవాలని నర్సాపూర్ ఉప తహసీల్దార్ మహేష్ విజ్ఞప్తి చేశారు. నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

చేగుంటలో కారు దగ్ధం

చేగుంట, న్యూస్‌టుడే: నిలిపి ఉన్న కారులో నుంచి మంటలు వచ్చి పూర్తిగా దగ్ధమైన ఘటన చేగుంటలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. సంగారెడ్డి జిల్లా ఆందోల్‌కు చెందిన రాఘవేంద్రశర్మతో పాటు మరో ముగ్గురు కారులో వచ్చి చేగుంట పీఏసీఎస్ వద్ద నిలిపారు. కారులో నుంచి నలుగురు దిగిన తర్వాత కొద్దిసేపటికి అందులో నుంచి పొగలు వచ్చి మంటలు వ్యాపించాయి. వెంటనే రాఘవేంద్రశర్మ మంటలను ఆపే ప్రయత్నం చేయగా అప్పటికే పూర్తిగా వ్యాపించి కాలిపోయింది. రామాయంపేట నుంచి ఫైరింజిన్ వచ్చి ఆర్పేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కారులో విద్యుదాఘాతం జరిగి ప్రమాదం చోటు చేసుకోవచ్చని భావిస్తున్నారు.

కొత్తపేట పాఠశాలలో చోరీ

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రహరీ ధ్వంసం చేసి పాఠశాల గదుల తాళాలు పగులగొట్టి 18 లీటర్ల వంట నూనెతో పాటు పప్పులు, నల్లాలు సుమారు రూ.20వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. ప్రధానోపాధ్యాయురాలు సుమంగళ సోమవారం పెద్దశంకరంపేట ఠాణాలో ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

చేగుంట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు..సుమారు 35ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఈ నెల 7న చేగుంట రైల్వే గేటు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు చేగుంట ఠాణాలో సంప్రదించాలని తెలిపారు.

పాపన్నపేట, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద హరితా హోటల్ సమీపంలో సుమారు 65-70ఏళ్ల వయస్సు ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి అచేతన స్థితిలో పడి ఉన్నారు. ఆదివారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పాపన్నపేట ఠాణాలో సంప్రదించాలని సూచించారు.

పిడుగుపాటుతో ఏడు మేకలు మృత్సువాత

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: పిడుగుపాటుతో ఏడు మేకల మృతి చెందిన ఘటన మండల పరిధి శాలిపేటలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు..మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎల్లమ్మ కుటుంబ సభ్యులతో కలిసి మేకలను మేపుకునేందుకు సోమవారం శాలిపేట శివారు పొలాల్లోకి వచ్చారు. భారీ వర్షం పడడంతో మేకలు చెట్టు కిందకు వెళ్లగా అక్కడ పిడుగుపడి మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.లక్షన్నర నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.